
సాక్షి కర్నూలు

సోమవారం ၊ 4 ၊ నవంబర్ ၊ 2024



శాస్త్రోక్తంగా పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామివార్లకు ఆదివారం శాస్త్రోక్తంగా పల్లకీ సేవ నిర్వహించారు. పల్లకీలో ఉత్సవమూర్తులను ఉంచి మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు.



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ నిత్యకళారాధన వేదికపై ఆదివారం హైద రాబాద్‌కు చెందిన రితువర్ణ కూచిపూడి నాట్యాలయం వారి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	: 1,633
ప్రస్తుతం	: 1,632
సామర్థ్యం (టీఎంసీలు)	: 105.788
ప్రస్తుతం	: 101.773
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 15,140
అవుట్ ఫ్లో	: 14,780

న్యూస్‌రీల్

వైభవంగా గోవర్ధన గిరి పూజ



జగన్నాథ్‌కు మహారాజభోగ నివేదన దృశ్యం

కర్నూలు కల్చరల్: ఇస్కాన్ ఆధ్వర్యంలో సామూహిక వన భోజనాలు, గోవర్ధన గిరి పూజలు ఘనంగా నిర్వహించారు. కర్నూలు నగర శివారులోని విజయ వనంలో జగన్నాథ్‌ను గోవర్ధన గిరి రూపంలో అలంకరించి విశేష పూజలు చేశారు. మహా రాజ భోగ నివేదన చేశారు. ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కర్నూలు బాధ్యులు రఘునందన సేవక ప్రభు ఆధ్వర్యంలో వేడుక జరిగింది. ఇస్కాన్ ప్రవచకులు వైష్ణో కృప చైతన్య దాస్ ప్రభు సందేశమిచ్చారు. ఇస్కాన్ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

- కలెక్టర్ డాక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులు అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమాన్ని సోమవారం కలెక్టరేట్‌తోపాటు అన్ని మండల, డివిజనల్, మునిసిపల్ కార్యాలయాల్లో నిర్వహిస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

కేసీ కాల్వకు 2,445 క్యూసెక్కులు విడుదల

కర్నూలు సిటీ: సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాలువకు 2,445 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. హొస్పేట్‌లోని టీబీ డ్యామ్‌కు ఇన్‌ఫ్లో ఉండడంతో 14,780 క్యూసెక్కులు డ్యాం గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్నారు. ఈ క్రమంలో సుంకేసుల బ్యారేజీకి 8,750 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుండగా కేసీ కెనాల్‌కు విడుదల చేసిన నీరు పోగా, మిగిలిన 6,257 క్యూసెక్కుల నీటిని రెండు గేట్ల ద్వారా దిగువకు వదులుతున్నారు.

అట్టహాసంగా టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభం



టేబుల్ టెన్నిస్ ఆడుతున్న క్రీడాకారులు

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పద్మావతినగర్ ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–17 విభాగంలో బాలబాలికలకు టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభమయ్యాయి. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమానికి ఆదివారం ఎస్‌జీఎఫ్ టేబుల్ టెన్నిస్ రాష్ట్ర పరిశీలకులు శ్రావణ్‌కుమార్, నంద్యాల జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శ్రీనాథ్ హాజరై మాట్లాడారు. 13 జిల్లాల నుంచి 130మంది క్రీడాకారులు, 50మంది క్రీడాధికారులు, సాంకేతిక సిబ్బంది పాల్గొన్నారన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ ఆంధ్ర ప్రదేశ్ టేబుల్ టెన్నిస్ కోచ్ ముంతాజ్‌బేగం, ఏపీరెడ్డి, దండె నాగరాజు, నాగేంద్ర, వెంకటేశ్వర్లు, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి వైఫల్యాన్ని నిలదీసి..

బాధిత కుటుంబానికి బాసటగా నిలిచి

- ముచ్చుమర్రి బాలిక కుటుంబాన్ని పరామర్శించిన వైఎస్సార్‌సీపీ నేతలు
- పార్టీ తరఫున రూ.పది లక్షల చెక్కు అందజేత
- కూటమి ప్రభుత్వ వైఫల్యాలను తూర్పారబట్టిన నాయకులు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే విరూపాక్షి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, నందికొట్కూరు ఇన్‌చార్జ్ దారా సుధీర్, పార్టీ నేతలు

సాక్షి, నంద్యాల: రాష్ట్రంలో ఎక్కడ చూసినా దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయి. ముక్కుపచ్చలారని బాలికలను చిదిమేస్తున్నారు. మహిళలు ఒంటరిగా బయటకు రావాలంటే జంకుతున్నారు. మాన ప్రాణాలకు రక్షణ లేకుండా పోయింది. కూటమి పార్టీలు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ అరాచకపాలన సాగుతోంది. బాధితులకు న్యాయం గాలిలో దీపంగా మారింది. కూటమి సర్కారు ఏర్పడిన తొలి నెల లోనే (జూలై 7న) పగిడ్యాల మండలం ముచ్చుమర్రి గ్రామంలో అభం శుభం తెలియని తొమ్మిదేళ్ల చిన్నారిని అత్యాచారం చేసి ఆ తర్వాత గొంతు నులిమి చంపేశారు. ఈ ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం రేపింది. ఉమ్మడి కర్నూలు జిల్లా ఉలిక్కిపడింది. నిందితులను కఠినంగా శిక్షించాలని వివిధ వర్గాల ప్రజలు నినదించారు. బాధితులకు అండగా రోడ్డెక్కారు. అయినా, కూటమి సర్కారుకు చీమకుట్టినట్టు కూడా లేదు. నాలుగు నెలలవుతున్నా బాలిక మృతదేహాన్ని కనిపెట్టలేక పోయింది. ఆది నుంచి ఈ విషయంలో సర్కారు వైఫల్యాన్ని ఎత్తిచూపుతూ వస్తోంది వైఎస్సార్‌సీపీ. తాజాగా ఆదివారం ఆ పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా, మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ దారా సుధీర్ తదితరులు కొత్త ముచ్చుమర్రి గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రూ.10 లక్షల ఆర్థిక సాయం చేసి న్యాయం జరిగే వరకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా తమ బిడ్డ ఆనవాళ్లు ఇప్పటి వరకు లభించలేదని, కనీసం తాము బిడ్డ అంత్యక్రియలు కూడా చేయలేకపోయామని కన్నీటి పర్యంతమయ్యారు. వీరి ఆవేదన వైఎస్సార్‌సీపీ నాయకులను కలచివేసింది. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు పాలనలో న్యాయం అందని ద్రాక్షగా మారిందన్నారు. బిడ్డను కోల్పోయి ఎంతో దుఃఖంలో ఉన్న కుటుంబాన్ని ఇప్పటి వరకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, హోంమంత్రి అనిత పరామర్శించకపోవడం శోచనీయమన్నారు.



బాలిక తల్లిదండ్రులను పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

ముచ్చుమర్రి ఘటన ప్రభుత్వానికి సిగ్గుచేటు

ముచ్చుమర్రి గ్రామంలో హత్యకు గురైన బాలిక మృతదేహాన్ని గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించకపోవడం శోచనీయం. కేసు ఛేదనలో పోలీసు యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. కనీసం అస్తికలైనా ఇస్తే దహన సంస్కారాలు చేసుకుంటామని బాధిత కుటుంబం వేడుకుంటోంది. అయినా, ప్రభుత్వానికి చలనం లేదు. ఈ ప్రభుత్వం అత్యాచారాలు, హత్యలు చేసేవారికే కొమ్ముకాయడం చాలా బాధాకరం.

– పాపిరెడ్డి, జిల్లా పరిషత్ చైర్మన్ కర్నూలు

మహిళలకు రక్షణ ఏదీ?

కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయింది. ముచ్చుమర్రిలో చిన్నారిని హత్య చేస్తే ఇప్పటి వరకు పట్టించుకోలేదు. చివరకు కుటుంబసభ్యులకు బాలిక శవం కూడా అప్పగించలేదు. ఈ కేసు విషయంలో బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు వారి తరఫున వైఎస్సార్‌సీపీ పోరాడుతుంది. ఇందులో భాగంగానే మా పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మేము వారిని కలిసి అండగా నిలబడతామని భరోసా ఇచ్చాం.

– డాక్టర్ దార సుధీర్, నందికొట్కూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

రాష్ట్రంలో అరాచక పాలన

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో అరాచక పాలన మొదలైంది. ఏ ఒక్కరికీ రక్షణ లేకుండా పోయింది. రోజూ ఏదో ఒక చోట మహిళలపై అత్యాచారాలు, హత్యలు, దాడులు జరుగుతూనే ఉన్నాయి. ముక్కు పచ్చలారని చిన్నారులను సైతం కామాంధులు చిదిమేస్తున్నారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులు రాజకీయ నాయకుల చేతిలో కీలుబొమ్మలుగా మారారు. ముచ్చుమర్రిలో నాలుగు నెలలు క్రితం ఎనిమిదేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడి హత్య చేశారు. తర్వాత శవాన్ని మాయం చేశారు. ఇంత వరకు పోలీసులు కేసును ఛేదించక పోగా మృతదేహాన్ని ఇప్పటి వరకు గుర్తించకపోవడం దారుణం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన దిశ చట్టాన్ని అమలు చేసి చిన్నారులకు, మహిళలకు, వృద్ధులకు రక్షణ కల్పించాలి.

– మాజీ ఎమ్మెల్సీ గంగుల ప్రభాకర్‌రెడ్డి

నోరుమెదపని డిప్యూటీ సీఎం

రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి. అరాచక పాలన సాగుతోంది. దీనిపై డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నోరుమెదపడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మహిళలు, బాలికలు అదృశ్యమవుతున్నారని ఆయన అసత్య ప్రచారం చేశారు. ఇప్పుడు ఆయనే అధికారంలో ఉన్నాడు. నాడు కనిపించకుండా పోయిన వారిని తీసుకొచ్చి కుటుంబసభ్యులకు అప్పగిస్తే సంతోషిస్తాం. ఇది చేయకపోగా కూటమి సర్కారు రెడ్‌బుక్ పేరుతో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తోంది. అమాయకులపై దాడులకు తెగబడుతోంది. మహిళలు, బాలికల రక్షణను గాలికి వదిలేసింది.

– విరుపాక్షి, ఆలూరు ఎమ్మెల్యే

రాష్ట్రాన్ని బిహార్‌గా మారుస్తున్నారు

రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. అత్యాచారాలు పెరిగిపోయాయి. అతిదారుణంగా చిన్నారులపై అఘాయిత్యాలు జరుగుతున్నాయి. గతంలో ఇలాంటి పరిస్థితులు ఎప్పుడూ చూడలేదు. దసరా పండుగ రోజు హిందూపురంలో అత్తాకోడలిపై గ్యాంగ్ రేప్ జరిగితే.. దీపావళికి కడియం నర్సరీలో మహిళపై సామూహిక అత్యాచారం చేశారు. రాష్ట్రాన్ని టీడీపీ నాయకులు బిహార్‌గా మార్చే ప్రయత్నం చేస్తున్నారు. హోంమంత్రిగా అనిత అన్‌ఫిట్.

– ఇసాక్‌బాషా, ఎమ్మెల్సీ

'రెడ్‌బుక్' కుట్రలు.. ఆగని వేధింపులు

- శభాష్‌పురం వైఎస్సార్‌సీపీ నేత హనుమంతు అక్రమ అరెస్ట్ ?
- పెండ్లికి వెళ్లి వస్తుండగా అదుపులోకి తీసుకున్న పోలీసులు
- అరెస్ట్ చేయలేదంటున్న తుగ్గలి ఎస్‌ఐ

పత్తికొండ (ఆళ్లగడ్డ): రెడ్‌బుక్ రాజ్యాంగంతో కూటమి ప్రభుత్వం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలే లక్ష్యంగా వేధిస్తోంది. ఇప్పటి వరకు తెలుగు దేశం నాయకులు ఎవరినైనా బెదిరించాలని పోలీసులకు సూచిస్తే చాలు స్టేషన్‌కు పిలిపించి భయపెట్టడమో, కొట్టడమో చేసేవారు. తాజాగా టీడీపీ కార్యకర్త కేసు పెట్టాడని తుగ్గలి మండలం శాభాష్‌పురం గ్రామ మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత హనుమంతును అక్రమంగా అదుపులోకి తీసుకెళ్లారన్న సమాచారం ఆదివారం పత్తికొండ నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. హనుమంతు కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. హనుమంతు మండలంలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ ఉంటాడు. ఈ క్రమంలో గత రెండు రోజుల క్రితం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త తలారి సుధాకర్.. హనుమంతు ఇంటి దగ్గరకు వచ్చి తిడుతుండటంతో ఇద్దరు గొడవపడ్డారు. దీంతో సుధాకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి హనుమంతుపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించినట్లు సమాచారం.

ప్యాపిలి హైవేపై కాపుకాచి అదుపులోకి?

హనుమంతు గతంలో సర్పంచుగా, ప్రస్తుతం ఆయన భార్య ఎంపీటీసీ సభ్యురాలు కావడంతో నిత్యం పోలీసులు, ప్రభుత్వ కార్యాలయాలకు తిరిగి పనులు చేయించుకునే వ్యక్తి కావడంతో పోలీసులు ఒక్క ఫోన్ చేసి స్టేషన్‌కు రావాలంటే వెళ్లేవాడు. అలాంటిది గద్వాలకు పెళ్లికి వెళ్లి తిరిగి గ్రామానికి వస్తున్నాడన్న విషయం తెలుసుకున్న పోలీసులు ప్యాపిలి హైవే దగ్గర ఏదో తీవ్రవాది కోసం కాపు కాసినట్లు కాచుకుని అక్కడికి రాగానే వాహనంలో నుంచి దించుకుని పోలీసు వాహనంలో ఎక్కించుకున్నట్లు బంధువులు తెలుపుతున్నారు. అతడిని తుగ్గలి పోలీస్ స్టేషన్‌కు తరలించి ఉంటారని భావించిన కుటుంబీకులు స్టేషన్ దగ్గరకు వెళ్లారు. అక్కడ కనిపించక పోవడంతో పత్తికొండ సీఐ, డీఎస్పీ కార్యాలయాలకు వెళ్లి ఆరా తీశారు. అయినా ఆచూకీ లభించలేదు. అసలు పోలీసులు అరెస్ట్ చేశారా లేక ప్రత్యర్థులు ఎవరైనా కిడ్నాప్ చేశారా అని కుటుంబ సభ్యులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

రెడ్‌బుక్‌లో పేరున్నందుకేనా?

హనుమంతు మండల వ్యాప్తంగా వైఎస్సార్‌సీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటుండటతో పాటు గతంలో మంత్రి నారా లోకేష్ పాద యాత్ర పత్తికొండకు వచ్చిన సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు ఆయనను అడ్డుకున్నారు. ఈ సంఘటనలో హనుమంతు పాత్ర ఉందని భావించిన టీడీపీ నేతలు అప్పుడే రెడ్‌బుక్‌లో అతని పేరు ఎక్కించినట్లు చెప్పడం జరిగింది. దీంతోనే పోలీసులు ఈ విధంగా రహస్య ప్రదేశానికి తరలించుకెళ్లి వేధిస్తున్నారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మేము అరెస్ట్ చేయలేదు

శభాష్‌పురంలో జరిగిన ఘర్షణకు సంబంధించి తలారి సుధాకర్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు హనుమంతుతో పాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేశాం. అయితే ఈ కేసుకు సంబంధించి మేము హనుమంతును కాని వేరే ఎవరినీ అదుపులోకి తీసుకోలేదు, అరెస్ట్ కూడా చేయలేదు.

– జయశేఖర్, ఎస్‌ఐ, తుగ్గలి

శ్రీశైలంలో 'కార్తీక' రద్దీ




పాతాళగంగలో పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు

శ్రీశైలంటెంపుల్: ఇల కైలాసమైన శ్రీశైల మహాక్షేత్రంలో కార్తీక రద్దీ నెలకొంది. కార్తీక మాసం మొదటి ఆదివారం సందర్భంగా ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేకువ జామున పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు స్వామిఅమ్మవార్ల దర్శనానికి బారులుదీరారు. భక్తులు ఆలయ గంగాధర మండపం వద్ద, ఆలయ ఉత్తర మాఢవీధిలో కార్తీకదీపారాధన చేసుకున్నారు. కార్తీక దీపాలను వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. భక్తులు భక్తిశ్రద్ధలతో లక్షవత్తులు, వెయ్యి వత్తులు, శివలింగాకార దీపాలు, ఓం నమఃశివాయ కారంలో దీపాలు వెలిగించి పూజలు నిర్వహించుకున్నారు.

నేడు లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి..

కార్తీక మొదటి సోమవారాన్ని పురస్కరించుకుని నేడు ఆలయ పుష్కరిణి వద్ద లక్షదీపోత్సవం, పుష్కరిణి హారతి కార్యక్రమాలను నిర్వహిస్తారు. భక్తులందరు దీపారాధన కార్యక్రమాన్ని నిర్వహించుకునేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



కృష్ణమ్మకు కార్తీక దీపాలు సమర్పిస్తూ..

మిరపకు తెగులు.. రైతుకు దిగులు

- తెగుళ్ల బారిన మిర్చి పంట
- సస్యరక్షణ చేపట్టినా కానరాని ఫలితం
- పంటను తొలగిస్తున్న అన్నదాతలు



లాల్‌మాన్‌పల్లె సమీపంలో వైరస్ దెబ్బకు మిర్చి పంటను ట్రాక్టర్‌తో తొలగిస్తున్న దృశ్యం

కృష్ణగిరి: ఎన్నో ఆశలతో రైతులు సాగు చేసిన మిర్చి పంటకు చీడపీడలు ఆశించడంతో రైతులు నష్టపోతున్నారు. పంటకు పచ్చదోమ, తెల్లదోమ, బింగి తెగులు సోకడంతో ఆకులు ముడత పడి మొక్క ఎదుగుదల నిలిచిపోవడంతో లబోదిబోమంటున్నారు. మండలంలోని లాన్‌మాన్‌పల్లె, ఎరుకలచెర్వు, సంగాల, ఆగవేలి, పెనుమాడ, పందిర్లపల్లె తదితర గ్రామాల్లో ఈయేడాది దాదాపుగా వెయ్యి ఎకరాల్లో తేజ రకంతోపాటు డబ్బి బ్యాడిగ రకం అధికంగా సాగు చేశారు. డబ్బి బ్యాడిగ రకానికి గత రెండేళ్లుగా మార్కెట్లో మంచి ధర పలకడంతో సాగుచేసిన రైతులు లాభాలు గడించారు. అలాగే ఈసారి కూడా వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. పంట ఏపుగా వచ్చి దిగుబడులు సాధించాలనుకున్నారు. కానీ ఒక్కసారిగా వైరస్ సోకడంతో పెట్టిన పెట్టుబడులు దేవుడేరుగు అని.. ఏకంగా పంటనే తొలగిస్తున్నారు. ఇప్పటి వరకు దాదాపు 70 ఎకరాల్లో పంటను దున్నేశారు. బోర్లు, కాలువ కింద వేలాది రుపాయలు పెట్టుబడులు పెట్టిన నేపథ్యంలో వచ్చిన మహమ్మారి దెబ్బకు అన్నదాతల్లో కలవరం మొదలైంది. అందుబాటులో ఉన్న క్రిమి సంహారిక మందులు ఎన్ని వాడినా.. ఎంత పిచికారీ చేసినా ఫలితం కనిపించడం లేదు. మిర్చి నారు పెంచి నాటు వేసి రెండు నెలలు దాటినా పంటలో ఎలాంటి ఎదుగుదల లేకపోవడంతో చేసేదేమీ లేక పంటను తొలగిస్తున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.70వేల దాకా ఖర్చు పెట్టినా ఫలితం లేక అప్పులపాలయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రెండు ఎకరాల్లో సాగు చేశాను



గత కొన్నేళ్లుగా నేను డబ్బి బ్యాడిగ రకం పంట సాగు చేస్తున్నాను. ప్రతేడాది నష్టం లేకుండా లబ్ధి పొందాం. రెండేళ్ల క్రితమయితే ఎకరాకు రూ. 10 లక్షల వరకు వచ్చింది. ఈ ఏడాది కూడా రెండు ఎకరాల్లో ఈ పంట సాగు చేశాను. ఇప్పటికే రెండు ఎకరాలకు లక్షన్నర వరకు ఖర్చు అయ్యింది. వివిధ కంపెనీలకు సంబంధించిన వారు గ్రామాలకు వచ్చి పంటలను పరిశీలించి పలు మందులు వాడాలని చెబితే వాడాం. కానీ ఎదుగుదల మాత్రం రావడం లేదు. దీంతో పంటను తొలగిస్తున్నాను.

– చాంద్‌బాషా, రైతు, లాల్‌మాన్‌పల్లె

ప్రభుత్వం ఆదుకోవాలి



మా గ్రామం పక్కన హంద్రీనీవా కాలువ పోవడంతో చానల్ కాలువ కూడా వచ్చింది. అలాగే మా పొలాల్లో ఎక్కడ బోర్లు వేసినా నీరు పడుతుంది. దీంతో ఖర్చుకు వెనకాడకుండా రెండు ఎకరాల్లో బ్యాడిగ రకం సాగుచేశాను. రెండు తరువాత తెగుళ్ల సోకడంతో పైరులో ఎలాంటి ఎదుగుదల లేకుండా పోయింది. ఇప్పటికే లక్షకుపైగా ఖర్చు పెట్టా. ఇలాగే ఉంటే ఖర్చులే తప్పా దిగుబడి రాదనే పంటను ట్రాక్టర్‌తో తొలగించా. ఇలా పంటలు నష్టపోయిన రైతులను గుర్తించి ప్రభుత్వం ఆదుకోవాలి.

– షేక్షావలి, రైతు, లాల్‌మాన్‌పల్లె

మంత్రి గారూ.. ఇటు చూడరూ!

- జిల్లాలో కరువు మండలాలు రెండేనట!
- గత రబీ ఇన్‌పుట్ సబ్సిడీ అందని వైనం
- ఉపాధి కరువై కూలీల వలసలు
- పారిశుద్ధ్య లోపంతో ప్రబలుతున్న రోగాలు
- నేడు డీడీఆర్‌సీ సమావేశం
- హాజరు కానున్న ఇన్‌చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలలవుతోంది. ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయి. ముఖ్యంగా వ్యవసాయ రంగం కుదేలవుతోంది. ప్రభుత్వం నుంచి భరోసా కరువై రైతులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉపాధి లేక కూలీలు వలసబాట పడుతున్నారు. పాలన పట్టు తప్పి జిల్లా అభివృద్ధి గతి తప్పుతోంది. నిధుల కొరతతో ఊరూరా పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి నిమ్మల రామానాయుడు అధ్యక్షతన డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ రివ్యూ కమిటీ (డీడీఆర్‌సీ) సమావేశం సోమవారం నిర్వహించనున్నారు. కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో జరిగే ఈ సమావేశానికి అన్ని శాఖలకు సంబంధించి అభివృద్ధి పనులపై మంత్రి సమీక్ష నిర్వహిస్తారని, అన్ని శాఖల అధికారులు నివేదికలతో హాజరు కావాలని సీపీఓ హిమ ప్రభాకరరాజు తెలిపారు. ఈ సమావేశంలో అనేక సమస్యలు ప్రస్తావనకు వచ్చే అవకాశం ఉంది. ప్రధానంగా వ్యవసాయం, గ్రామీణ నీటి సరఫరా, పారిశుద్ధ్యం, నీటి పారుదల, విద్యుత్ శాఖలపై సమీక్షించనున్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గత రబీ సీజన్‌కు సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ కోసం దాదాపు 90 వేల మంది రైతులు ఎదురు చూస్తున్నారు. రబీలో వేసిన సెనగ, జొన్న, కొర్ర, మొక్క జొన్న తదితర పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి.



కలెక్టరేట్ సముదాయం

కర్నూలు జిల్లాలో 54,382 మంది రైతులకు రూ.58.28 కోట్లు, నంద్యాల జిల్లాలో 37,208 మంది రైతులకు రూ.37.76 కోట్లు ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో అందాల్సి ఉంది. అలాగే 2024 ఖరీఫ్‌కు సంబంధించి కేవలం కొతాళం, పెద్దకడబూరు మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా ఇటీవల ప్రభుత్వం ప్రకటించింది. అయితే జిల్లాలో అన్ని మండలాల్లో కరువు ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నా ప్రభుత్వం కరువు మండలాలుగా గుర్తించ లేదు. ఖరీఫ్‌లో ముందుగా వర్షాభావం, ఆ తర్వాత భారీ వర్షాలతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అయినా ప్రభుత్వం రెండు మండలాలనే కరువు ప్రాంతాలుగా ప్రకటించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

విద్యుత్ కనెక్షన్ల కోసం రైతుల నిరీక్షణ..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో దాదాపు 10 వేల మందికి పైగా రైతులు వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకొని, విద్యుత్ శాఖకు చెందిన ఇంజనీర్లు వేసిన అంచనా మేరకు ఒక్కొక్కరు రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు డిపాజిట్ చేశారు. అయితే ... నేటికి వారికి కనెక్షన్లు ఇవ్వని పరిస్థితి నెలకొంది. అలాగే విద్యుత్ మెటీరియల్ (ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుల్, కండక్టర్‌తో పాటు వీటికి అనుబంధంగా అవసరమైన సామగ్రి) కూడా స్టోర్‌లో లేనట్లు తెలుస్తోంది.

పంట కాల్వల మరమ్మతులు మరిచారు

ఎల్లెల్సీ, కేసీ కెనాల్, హంద్రీనీవా, చెరువుల ఆయకట్టు పంట కాలువల మరమ్మతులకు నిధులు మంజూరు చేయాల్సి ఉంది. గత ప్రభుత్వం ప్రతి ఏటా ఖరీఫ్ సాగుకు ముందే ఓఅండ్‌ఎం నిధులు మంజూరు చేసి పంట కాలువలకు నీరు వచ్చేందుకు ముందుగానే పనులు పూర్తి చేసే వారు. గత ఐదేళ్లలో ఉమ్మడి జిల్లాలో దాదాపు రూ.232 కోట్లు కాలువల మరమ్మతులకు ఖర్చు చేశారు. ఈ ఏడాది ప్రభుత్వం ఈ పనులు చేసేందుకు రూ.70.37 కోట్లకు మొదటగా ప్రతిపాదనలు చేయగా, నిధులు లేవని రూ.19.28 కోట్ల ప్రతిపాదనలు తీసుకున్నారు. నెల రోజులైనా పంపిన ప్రతిపాదనలకు అతిగతీ లేదు.

అరకొర నిధులతో రోడ్లు బాగుపడేనా..

జిల్లాలో కురిసిన వర్షాలకు ఆర్‌అండ్‌బీ రహదారులు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఏకంగా 838 కిలోమీటర్ల మేర రహదారులకు మరమ్మతులు చేయాల్సి ఉంది. అయితే వాటిని బాగు చేయడానికి ప్రభుత్వం కేటాయించిన నిధులతో సాధ్యమేనా అనే అనుమానం కలుగుతోంది. సంక్రాంతిలో మొదటి విడతలో 11.16 కోట్లతో 412 కిలో మీటర్లు, రెండో విడతలో 8.71 కోట్లతో 4.26 కిలోమీట్ల రహదారులను బాగు చేసేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఇక దెబ్బతిన్న పీఆర్ రోడ్లను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో గ్రామీణ ప్రాంత ప్రజలు గుంతలమయమైన రహదారులపై ప్రమాదపుటంచున ప్రయాణాలు చేస్తున్నారు.

పారిశుద్ధ్యంపై శ్రద్ధ ఏదీ..

జిల్లాలో ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖల మధ్య సమన్వయ లేకపోవడంతో పారిశుద్ధ్యం లోపించి రోగాలు ప్రబలుతున్నాయి. కర్నూలు నగరంలోని దోమల స్వైర విహారంతో జనం జ్వరాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీరు నిలిచి మురికి కూపాలను తలపిస్తున్నాయి. ఊరూరా పారిశుద్ధ్య పనులపై పర్యవేక్షణ లేకపోవడం, మంచినీటి సరఫరాలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో అతిసారం ప్రబలి ఆసుపత్రుల్లో చేరారు.

క్లుప్తంగా

వ్యక్తిపై తేనేటీగల దాడి


చికిత్స పొందుతున్న బాధితుడు

మిడుతూరు: చెరుకుచెర్ల గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి అనే వ్యక్తి ఆదివారం పొలంలో పనులు చేస్తుండగా తేనేటీగలు దాడి చేశాయి. దీంతో అతను తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. పక్క చేనులో ఉన్న భార్య గమనించి బంధువులకు సమాచారమిచ్చారు. వారు హుటాహుటిన చికిత్స నిమిత్తం చంద్రశేఖర్‌రెడ్డిని స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు హాస్పిటల్‌కు రెఫర్ చేసినట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


కురువ దూలప్ప (ఫైల్)

ఆలూరు: మండలంలోని అరికెర గ్రామానికి చెందిన రైతు కురువ దూలప్ప (39) ఆదివారం విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. వివరాల్లోకి వెళితే.. అరికెర గ్రామానికి చెందిన కురువ లింగన్న నాలుగో కుమారుడు దూలప్ప తన పొలంలో మిరప పంటను సాగుచేశాడు. ఆదివారం పైరుకు నీరు పెట్టేందుకు బోరు వద్ద స్టార్టర్‌ను ఆన్ చేయగా.. స్టార్టర్ బాక్స్ నుంచి బోరు మోటార్‌కు అమర్చిన తీగను ఎలుకలు కొరికి ఉండడంతో తీగ కాలికి తగిలి విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. కాసేపటికి పొలానికి వెళ్లిన భార్య విగత జీవిగా పడి ఉన్న భర్తను చూసి కన్నీరుమున్నీరుగా విలపించింది. చుట్టుపక్కల రైతులు హుటాహుటిన ఆలూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహానికి పోస్టుమార్టం చేశారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

కోవెలకుంట్ల: వివాహ సమయంలో కట్నకానుకలు ఇచ్చినా అదనపు కట్నం కోసం వేధిస్తుండటంతో బాధిత మహిళ ఆదివారం పోలీసులను ఆశ్రయించింది. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కోవెలకుంట్లలోని సుంకులమ్మ వీధిలో నివాసం ఉంటున్న సుమలతకు 2021లో బనగానపల్లెకు చెందిన రామాంజనేయులుతో వివాహం జరిగింది. కొన్ని నెలల నుంచి అదనపు కట్నం తేవాలని భర్తతో పాటు అత్తమామలు వేధింపులకు గురి చేస్తున్నారు. వారి వేధింపులు తాళలేక ఇటీవల పుట్టింటికి చేరుకున్న సుమలత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు భర్త, అత్తమామలపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

అటవీ సిబ్బంది మెరుపుదాడి


కలపను సీజ్ చేసి క్యాంపుకు తరలిస్తున్న దృశ్యం

బండిఆత్మకూరు: అటవీ శాఖ ఆధ్వర్యంలో శనివారం అర్ధరాత్రి జరిపిన మెరుపు దాడుల్లో అక్రమంగా వెదురు కర్రలను తరలిస్తున్న 10 బార్నెస్టిక్ సైకిళ్లను అధికారులు సీజ్ చేశారు. వివరాలు.. రాత్రి సమయాల్లో అక్రమంగా కలప తరలిస్తున్నారనే సమాచారం రావడంతో బండి ఆత్మకూరు అటవీ క్షేత్రాధికారి జెడ్.నాసిర్‌ఝా తన సిబ్బందితో సింగవరం తెలుగుగంగ కాలువ వెంట గస్తీ నిర్వహించారు. ఓంకారం సెక్షన్ నుంచి నారపురెడ్డి కుంట సెక్షన్ వరకు రాత్రంతా సోదాలు చేసి, నారాయణాపురం, మోతుకూరు, సంతజుటూరు రస్తా నుంచి ఏ.కోడూరు వరకు గస్తీ నిర్వహించారు. అక్రమంగా వెదురు తరలిస్తున్న 10 సైకిళ్లను సీజ్ చేసి కొత్రా బేస్‌కు తరలించారు. ఎవరైనా అనుమతి లేకుండా అడవిలోనికి ప్రవేశించి కలపను అక్రమంగా రవాణా చేసినా, వన్యప్రాణులకు హాని కలిగించినా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

తరలిపోతున్న ఎర్ర బంగారం

- బనసవాసి ప్రాంతంలో యథేచ్ఛగా ఎర్రమట్టి తరలింపు
- ఖాళీ అవుతున్న వృక్ష సంపద
- అధికార పార్టీ నాయకుల అండతో చెలరేగిపోతున్న అక్రమార్కులు
- పట్టించుకోని అధికారులు


ఫారంలో టేకు చెట్ల మధ్య ఎర్రమట్టిని తవ్విన అక్రమార్కులు

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని బనవాసి అటవీ ప్రాంతం రియల్టర్, కాంట్రాక్టర్లకు బంగారు బాతులా మారింది. విలువైన అటవీ సంపదైన ఎర్ర మట్టిని యథేచ్ఛగా కొల్లగొడుతున్నారు. 2 వేల హెక్టార్లలో విస్తరించిన ఫారం నుంచి యథేచ్ఛగా ఎర్రమట్టిని తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. సంవత్సరాల కాలంగా ఎర్రమట్టి అక్రమంగా తరలిపోతున్నా అధికారులకు ముడుపులు అందుతుండటంతో చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజా ప్రతినిధుల అండతోనే ఎర్ర మట్టి (గ్రావెల్)ను తరలిస్తున్నారు. గతంలో కాంట్రాక్టర్లు ఫారం పరిసర ప్రాంతాల్లోని కొండల్లో ఎర్రమట్టిని తవ్వేవారు. అయితే ఇప్పుడు నేరుగా ఫారంలో టేకు చెట్లు పెంచుతున్న వనంలోనే మట్టిని తవ్వేస్తున్నారు. టేకు చెట్ల అడుగు వరకు మట్టిని తరలిస్తుండటంతో ఆధారం లేక గాలులు వస్తే టేకు చెట్లు నేలకూలే అవకాశముంది. కూలిన టేకు చెట్లను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఒకప్పుడు కళకళలాడిన బనవాసి ఫారం నేడు అక్రమార్కులకు ఆర్థిక వనరుగా మారిపోయింది. ఎర్రమట్టిని తరలించే కాంట్రాక్టర్ల ద్వారా కింది స్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి అధికారుల వరకు భారీగా ముడుపులు అందుతున్నట్లు తెలుస్తోంది.

మట్టి తవ్వకాలు జరిగే ప్రాంతాలివీ

అక్రమార్కులు ఎర్రమట్టిని తరలించేందుకు అనువైన ప్రాంతాలను ఎంచుకున్నారు. మండల పరిధిలోని బనవాసి ఫారం, నవోదయ పాఠశాల దగ్గర, మాచుమాన్‌దొడ్డి, ఎస్.నాగాలపురం గ్రామ కొండల్లో మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఫారం నుంచి రోజూ ఎర్రమట్టిని ట్రాక్టర్లలో తరలిస్తూ లక్షల రూపాయలు అటవీ సంపదను కొల్లగొడుతున్నారు. కొండల్లో ప్రొక్లెయినర్లతో తవ్వేయడంతో కనుచూపు మేర గుంతలు ఏర్పడ్డాయి. మట్టిని తరలించే రియల్టర్లు, కాంట్రాక్టర్లు అధికార పార్టీ నాయకులకు ట్రాక్టరుకు ఇంత చొప్పున డబ్బు ఇవ్వాలని నిర్ణయించినట్లు, డబ్బులు ఇచ్చిన వారి ట్రాక్టర్లు మాత్రమే మట్టిని తరలించే విధంగా చూస్తున్నట్లు సమాచారం.


ట్రాక్టర్‌లో ఎర్రమట్టి అక్రమ తరలింపు

టేకు చెట్ల నరికివేత

బనవాసి ఫారంలో ఎర్రమట్టి తరలింపుతో పాటు అక్రమార్కులు చెట్లను నరికి వేస్తూ అడవిని పలుచన చేస్తున్నారు. చుట్టు పక్కల గ్రామాల్లోని కొందరు ఎడ్ల బండ్లతో వచ్చి పెద్ద పెద్ద చెట్లను నరికి అక్రమంగా తరలిస్తున్నారు. గత నెలలో చెట్లను నరుకుతున్న అక్రమార్కులను అధికారులు పట్టుకుంటే అదే ప్రాంతానికి చెందిన ఓ ప్రజాప్రతినిధి తన పలుకుబడితో విడిపించుకుపోయిన విషయం తెలిసిందే. పనులు లేకపోవడంతో చెట్లను నరికి ఆదాయం పెంచుకుంటున్నామంటూ బహిరంగంగానే చెబుతున్నారు. ఇలాగే కొనసాగితే అడవులు ఖాళీ అయ్యే ప్రమాదముంది.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయం

బనవాసి ఫారం ఫారెస్ట్ అంసాఘిక కార్యకలపాలకు నిలయంగా మారిపోయింది. గతంలో వాచర్ల పర్యవేక్షణ ఉండటంతో అంసాఘిక కార్యకలాపాలు జరిగేవి కాదు. ఇప్పుడు ఎవరూ లేకపోవటంతో వ్యభిచారం, మద్యం తాగడం వంటివి నిత్యం జరుగుతున్నాయి. సమీప గ్రామాల ప్రజలు ఫారెస్ట్ నుంచి పట్టణానికి నడిచిరావాలన్నా మద్యం రాయుళ్లను చూసి భయపడుతున్నారు. అటుగా వెళ్తే ఏమైనా జరుగుతుందేమోనని వెళ్లడం మానేశారు. అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


ఫారెస్ట్‌లో పడిఉన్న ఖాళీ మద్యం సీసాలు

మట్టిని తరలిస్తే చర్యలు తీసుకుంటాం

ఫారంలో అక్రమంగా ఎర్రమట్టిని తరలిస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. ఎవరైనా మట్టిని తరలించినా, చెట్లను నరికివేసినా చర్యలు తీసుకుంటాం. మట్టి తరలించుకునేందుకు ఎవరికీ అనుమతి ఇవ్వలేదు. మా కళ్లుగప్పి మట్టిని తరలించేందుకు ప్రయత్నిస్తే పట్టుకొని కేసులు పెడతాం. ఇక మీదట మట్టి తవ్వకాలు జరగకుండా చూస్తాం.

– చంద్రశేఖర్, ఇన్‌చార్జ్ డీడీ, బనవాసి ఫారం

అధికారుల దాడులు నామమాత్రమే

బనవాసి అటవీ ప్రాంతంలో అక్రమార్కులు యథేచ్ఛగా ఎర్రమట్టిని తరలిస్తూ, చెట్లను నరికి వేస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదు. పర్యవేక్షణ లోపం, అటవీ ప్రాంతానికి కాపలాగా ఉన్న చీఫ్ వలంటీర్లకు వేతనాలు అందక పోవడంతో వారు సక్రమంగా పని చేయడం లేదు. లక్షలు విలువ చేసే బనవాసి ఫారం సంపదను కొల్లగొడుతున్నా ఎవరూ పట్టించుకోకపోవటంతో అక్రమార్కులకు మంచి అవకాశం దొరికింది. అటవీ అధికారులు పట్టించుకోకపోయినా, రెవెన్యూ అధికారులైనా బాధ్యతగా వ్యవహరిస్తే కొంతవరకు ఎర్రమట్టి అక్రమంగా తరలింపును అడ్డుకోవచ్చు.

అయ్యో పాపం

- వృద్ధురాలైన తల్లిని అర్ధరాత్రి నడిరోడ్డుపై వదిలేసిన కుమారుడు
- చలికి వణుకుతూ దీనస్థితిలో తల్లి
- పత్తికొండలో అమానవీయ ఘటన


పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు

పత్తికొండ(తుగ్గలి): ఒంట్లో శక్తి ఉన్నంత కాలం పిల్లల కోసం కష్టపడింది. కష్టాలు దిగమింగుకుని పిల్లల బాగుకోసం తాపత్రయ పడింది. ఇంత చేసినా ఆ తల్లిపై కనికరం మరిచారు వారసులు. ఆలనాపాలనా చూడాల్సిన కుమారుడే తల్లిని వదిలించుకున్నాడు. వృద్ధురాలు అనే జాలి కూడా లేకుండా అర్ధరాత్రి నడి రోడ్డుపై వదిలేసి వెళ్లిన అమానవీయ ఘటన పత్తికొండలో చోటు చేసుకుంది. వివరాలు.. అనంతపురం జిల్లా గుంతకల్లుకు చెందిన తిరుపతమ్మకు కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. పెద్ద కూతురు పత్తికొండలో, చిన్న కూతురు వివాహమై బళ్లారిలో నివాసముంటున్నారు. భర్త ఐటీసీ కంపెనీలో డ్రైవర్‌గా పనిచేసేవారు. చాలీచాలని జీతంతో కుటుంబాన్ని నెట్టుకొచ్చారు. భర్త చనిపోయాక తిరుపతమ్మ కుమారుడికి భారం కాకూడదని బళ్లారి సమీపంలోని వృద్ధాశ్రమంలో చేరి తనకు వచ్చే పింఛన్‌పైనే ఆధారపడి జీవించేది. ఇదిలాఉండగా ఇటీవల ఆమె కిందపడటంతో కాలువిరిగింది. చిన్న కూతురు, కొడుకు శ్రీనివాసులు వైద్యం చేయించారు. ఆ తర్వాత తిరుపతమ్మ గుంతకల్లులో కుమారుడి ఇంట్లోనే ఉంటోంది. ట్రావెల్స్ నిర్వహణలో ఆర్థికంగా చితికిపోయిన శ్రీనివాసులు భారమైన తల్లిని శుక్రవారం అర్ధరాత్రి ఆటోలో తీసుకొచ్చి చెల్లెలు చూసుకుంటుందని పత్తికొండ ట్రాన్స్‌కో కార్యాలయం సమీపంలోని కాలనీలో రోడ్డుపై విడిచి వెళ్లారు. చలికి వణుకుతూ ఒంటరిగా ఉన్న వృద్ధురాలిని చూసిన పలువురు పోలీసులు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి విషయంపై ఆరా తీశారు. కూతుళ్లు, కుమారుడికి సమాచారం ఇచ్చినా స్పందించకపోవడంతో వృద్ధురాలిని చికిత్స నిమిత్తం 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆదివారం సాయంత్రం కూడా వృద్ధురాలికి తీసుకెళ్లేందుకు ఎవరూ రాకపోవడంతో ఆమె ఆస్పత్రిలోనే ఉంది. బిడ్డలకు ఆస్తి అంతా రాసిచ్చానంటూ కొడుకు, కోడలు, మనుమరాలు తనను ఇక్కడ వదిలి వెళ్లారంటూ తిరుపతమ్మ కన్నీరు మున్నీరైంది.

ఆటోలు ఢీకొని ఇద్దరి దుర్మరణం

- మరో ఆరుగురికి తీవ్రగాయాలు
- ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనానికి వెళుతుండగా ప్రమాదం



ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన రత్నబాయి, ప్రమాదంలో మృతి చెందిన ఈశన్న


ప్రమాదంలో దెబ్బతిన్న ఆటో


ఆదోని అర్బన్: మండలంలోని గణేకల్ గ్రామ సమీపంలో రెండు ఆటోలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతిచెందగా, ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులు పోలీసులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం, బళ్లారి జిల్లాకు చెందిన రత్నబాయి, భర్త రవిరావు, కుమారుడు ఉరుకుంద ఈరన్న, కుమార్తె విద్యాశ్రీ, చిత్రదుర్గ తాలూకాకు చెందిన ఈశన్న, మేనకోడలు అరుణాక్షి, బళ్లారికి చెందిన కుబేర్, కోటేకల్ గ్రామానికి చెందిన ఉమాదేవి, ఆదోనికి చెందిన సుకుమార్ ఆదివారం ఆటోలో కౌతాళం మండలంలోని ఉరుకుంద ఈరన్నస్వామి దర్శనానికి వెళ్తున్నారు.అదే ఆటోలో మరికొందరు ఇతర పనులపై వెళుతున్నారు. గణేకల్ గ్రామ సమీపంలో ట్రాలీ ఆటో ఎదురుగా రావడంతో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. తీవ్రంగా గాయపడిన రత్నబాయి (50)ను ఆదోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా కోలుకోలేక మృతిచెందింది. భర్త రవిరావు, కుమారుడు ఉరుకుంద ఈరన్న, కుమార్తె విద్యశ్రీకి గాయాలయ్యాయి. చిత్రదుర్గ నుంచి కౌతాళం మండలంలోని చూడి గ్రామంలో మేన కోడలు అరుణాక్షిని వదిలేందుకు వెళ్తున్న ఈశన్న ప్రమాద స్థలంలోనే మృతిచెందాడు. బళ్లారికి చెందిన కుబేర్, కోటేకల్‌కు చెందిన ఉమాదేవి, ఆదోనికి చెందిన సుకుమార్‌కు గాయాలయ్యాయి. గాయాలపాలైన వారిని స్థానికులు ఆదోని ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

అనుమానంతో అంతమొందించాడు


నిందితుడు రవీంద్ర

డోన్ టౌన్: పట్టణ సమీపంలోని వ్యవసాయమార్కెట్ యార్డు ఎదురుగా హరిస ర్వోత్తంరెడ్డి కాలనీలో ఈనెల 30న జరిగిన మహిళ అనుమానాస్పద మృతిని పోలీసులు ఛేదించారు. అనుమానంతో భర్తే కొట్టి చంపినట్లు విచారణలో తేలింది. పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా ఆదివారం ఈ కేసు వివరాలు వెల్లడించారు. బండి ఆత్మకూరు మండలం సింగవరం గ్రామానికి చెందిన దేవదానం కుమారుడు నిందితుడు భూపాల రవీంద్ర ఏడేళ్ల క్రితం డోన్‌కు వచ్చి కార్పెంటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఎక్కడైనా సువార్త స్వస్థత మహా సభలు జరుగుతుంటే వెళ్తుంటాడు. ఈ క్రమంలో 2019లో ఉమ్మడి నల్గొండ జిల్లా కోదాడ పట్టణానికి చెందిన శాంతమ్మతో పరిచయం ఏర్పడింది. తర్వాత అది ప్రేమగా మారడంతో రెండేళ్ల క్రితం ఓ ప్రార్థన మందిరంలో వివాహం చేసుకున్నారు. ఐదు నెలల కిందట వీరికి ఓ పాప జన్మించింది. అయితే, కొద్ది రోజుల నుంచి భార్యపై అనుమానం పెంచుకున్న నిందితుడు ఈనెల 30వ తేదీ ఆమె ఫోన్‌లో మాట్లాడుతుండగా కర్రతో తీవ్రంగా కొట్టాడు. ఈ దెబ్బలకు ఆమె చనిపోయింది. మృతురాలి సోదరుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్న పోలీసులకు దర్యాప్తులో అసలు విషయం తెలిసింది. అనుమానంతో భార్యను హత్య చేసినట్లు రవీంద్ర అంగీకరించాడు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు. మృతురాలి కుమార్తె సుజనను కర్నూలులోని మాతాశిశు సంరక్షణ కేంద్రానికి తరలించనున్నట్లు వెల్లడించారు.

లారీపై విరిగిపడ్డ విద్యుత్ స్తంభం


రుద్రవరంలో లారీపై విరిగి పడ్డ విద్యుత్ స్తంభం

రుద్రవరం: మండల కేంద్రం రుద్రవరంలో శనివారం రాత్రి ప్రమాదవశాత్తూ విద్యుత్ స్తంభం విరిగి లారీపై పడింది. అయితే, ఆ సమయంలో అటు వైపు ఎవరు లేక పోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. వివరాల్లోకి వెళితే.. రుద్రవరం గ్రామ పొలిమేర నుంచి మొక్క జొన్నల లోడుతో ఓ లారీ గ్రామంలోని ప్రధాన రహదారి మీదుగా నంద్యాల వైపు వెళ్తుంది.అమ్మవారిశాల సెంటర్ దాటి కొద్ది దూరం వెళ్లగానే పై నున్న విద్యుత్ తీగలు లారీకి తగులుకున్నాయి. గమనించని డ్రైవర్ లారీని అలాగే ముందుకు కదిలించగా విద్యుత్ స్తంభం మధ్యలోకి విరిగి ఆ వాహనం మీదనే పడింది. ఆ సమయంలో విద్యుత్ తీగలు ఒకదానికొకటి రాసుకోవడంతో నిప్పులు రాలి పడ్డాయి. అయితే, ఆ సమయంలో దారిలో ఎలాంటి రాక పోకలు లేకపోవడంతో ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న విద్యుత్ సిబ్బంది వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపేశారు. ఆదివారం మధ్యాహ్నం వరకు అటు వైపు రాక పోకలు పూర్తిగా నిలిచి పోయాయి. అధికారులు విరిగి పడిన విద్యుత్ స్తంభాన్ని తొలగించి కొత్త స్తంభం అమర్చి తీగలను సరి చేసి సమస్యను పరిష్కరించారు.

రేషన్ దుకాణాలపై విజిలెన్స్ దాడులు


గోనెగండ్లలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

గోనెగండ్ల: మండల కేంద్రంలోని రేషన్ దుకాణాలపై శనివారం రాత్రి విజిలెన్స్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. దాడులు అర్ధరాత్రి 12 గంటల వరకు కొనసాగాయి. గోనెగండ్లలోని 8 దుకాణాలను విజిలెన్స్ అధికారులు రామకృష్ణ, సునీల్ కుమార్, సిద్దయ్య, రమణ వేర్వేరుగా వెళ్లి స్టాక్, రిజిస్టర్లను తనిఖీ చేశారు. 1320004 రేషన్ దుకాణంలో 143 కేజీల బియ్యం తక్కువ ఉన్నట్లు విచారణలో తేల్చారు. మిగతా బియ్యం రేషన్ బండిలో ఉన్నట్లు డీలర్ చెప్పడంతో వాటిని రిటర్న్ చేయించి తేడా ఉండడంతో కేసు నమోదు చేశారు. 1320036 రేషన్ దుకాణంలో 1115 కేజీల బియ్యం తక్కువ ఉన్నట్లు విచారణలో తెలింది. ఈ రెండు దుకాణాలపై 6ఏ కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు ఆదివారం సాయంత్రం ప్రకటన విడుదల చేశారు. మిగతా ఆరు దుకాణాలను తనిఖీలు చేసి ఇర్రెగ్యూలర్ కింద హెచ్చరికలు జారీ చేశారు. విజిలెన్స్, గోనెగండ్ల వీఆర్వోలు ఉన్నారు.

రేషన్ డీలర్లు అప్రమత్తం

రేషన్ దుకాణాలపై విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా దాడులు నిర్వహించడంతో మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న డీలర్లు అప్రమత్తమయ్యారు. మండల వ్యాప్తంగా 43 రేషన్ దుకాణాలు ఉన్నాయి. గతంలో ఎప్పుడూ అర్ధరాత్రి వరకు విజిలెన్స్ అధికారులు దాడులు చేసిన సంఘటనలు లేవు. ఇప్పుడు జరగడం పట్ల డీలర్లు పలు అనుమానాలు వ్యక్తం చేస్తూ లోపాలను సరిచేసుకొనే పనిలో పడ్డారు.

కోళ్లబావాపురంలో కల్తీ నెయ్యి పట్టివేత


వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ, ఎస్‌ఐ

నందికొట్కూరు: మండల పరిధిలోని కోళ్లబావాపురం గ్రామంలో పోలీసులు కల్తీ నెయ్యిని గుర్తించి పట్టుకున్నారు. ఆదివారం ఉదయం గ్రామంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ చేపట్టారు. ఇంటింటికి వెళ్లి తనిఖీ చేస్తుండగా చిట్టెమ్మ ఇంట్లో 20 లీటర్లు, ధనుంజయుడు ఇంట్లో 10 లీటర్ల కల్తీ నెయ్యి పట్టుబడింది. అలాగే రాముడు అనే వ్యక్తి వద్ద 30 లీటర్ల నాటు సారా లభించింది. నిందితుల నుంచి వాటిని స్వాధీనం చేసుకుని పోలీసులు కేసులు నమోదు చేశారు. కాగా కల్తీ నెయ్యి తయారు చేసి ఎక్కడకు సరఫరా చేస్తున్నారో విచారణంలో తేలనున్నట్లు రూరల్ సీఐ సుబ్రమణ్యం తెలిపారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు. కార్డెన్ సెర్చ్‌లో ఎస్‌ఐలు తిరుపాలు, ఓబులేసు పాల్గొన్నారు.

విషపురుగు కాటుతో ఉపాధ్యాయుడి మృతి

కర్నూలు(సెంట్రల్): నిద్రిస్తున్న సమయంలో విషపురుగు కాటేయడంతో ఉపాధ్యాయుడు మృతి చెందాడు. ఘటనపై నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన మేరకు.. నగరంలోని వీకర్ సెక్షన్ కాలనీకి చెందిన కాశపోగు భానుప్రకాష్ జూపాడుబంగ్లా గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. ఆయన శనివారం ఇంటి బయట నిద్రించగా విషపురుగు కాటేసింది. అస్వస్థతకు గురైన ఆయన్ను కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు. ఈ క్రమంలో ఆదివారం కోలుకోలేక మృతి చెందాడు. భానుప్రకాష్ తల్లి చిట్టెమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

దొంగ అరెస్ట్.. బంగారం, నగదు రికవరీ


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా


నంద్యాల: శిరివెళ్ల మండలం గోవిందపల్లె గ్రామంలో గత సెప్టెంబర్‌లో జరిగిన చోరీ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి రూ.11.40 లక్షల సొమ్ము రికవరీ చేసినట్లు జిల్లా ఎస్పీ అదిరాజ్‌సింగ్‌రాణా తెలిపారు. ఆయన ఆదివారం కేసు వివరాలు వెల్లడించారు. గత సెప్టెంబర్‌లో గోవిందపల్లెకు చెందిన బద్రి శ్రీనివాసులు, కుటుంబసభ్యులు పొలం పనులకు వెళ్లి మధ్యాహ్నం తిరిగివచ్చి చూడగా ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి స్పెషల్ టీంను నియమించి విచారణ చేశారు. అదే గ్రామానికి చెందిన పగిడి నరసింహ (19) అనే యువకుడు చోరీకి పాల్పడినట్లు తెలిసింది. అతన్ని అదుపులోకి తీసుకుని రెండున్నర తులాల తాళిబొట్టు చైను, రెండు తులాల నెక్లెస్, 3 తులాల కమ్మలు, మాటీలు, జింకీలు, ఉంగరం, చోరీ డబ్బులతో కొనుగోలు చేసిన రూ.1.20 లక్షలు విలువచేసే మూడు సెల్‌ఫోన్లు, రూ.7.80 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ తెలిపారు. నంద్యాల శ్రీనివాస సెంటర్ రోడ్డులో టీస్టాల్ వద్ద ఉన్న నిందితుడిని ఆదివారం అరెస్ట్ చేసినట్లు చెప్పారు. చోరీ కేసును ఛేదించిన స్పెషల్ టీంను, ఆళ్లగడ్డ పోలీసులను ఎస్పీ అభినందించారు.

సిమెంట్ ఫ్యాక్టరీలో కార్మికుడి మృతి


మృతి చెందిన సురేష్

కొలిమిగుండ్ల: కల్వటాల సమీపంలోని రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీలో ఆదివారం తెల్లవారు జామున ప్రమాదవశాత్తు జరిగిన ప్రమాదంలో ఓకార్మికుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. వైఎస్సార్ జిల్లా మైలవరం మండలం దన్నవాడకు చెందిన వడ్ల సురేష్‌ఆచారి (28) ఏడాది నుంచి రామ్‌కోలో ఓ కాంట్రాక్టర్ కింద అసిస్టెంట్ ఫిట్టర్‌గా పని చేస్తున్నాడు. తెల్లవారు జామున డ్యూటీలో ఉన్న అతను బొగ్గు క్రషర్ మిషన్‌ను క్లీన్ చేసేందుకు వెళ్లగా అది దానంతట అదే ఆన్ అయింది. సురేష్‌ఆచారికి బెల్ట్ తగిలి సమీపంలో ఉన్న మట్టి కుప్పలో పడ్డాడు. తలకు గాయమై ముక్కులో నుంచి రక్తం వచ్చింది. తోటి సిబ్బంది ఫ్యాక్టరీకి చెందిన అంబులెన్స్‌లో బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న సీఐ రమేష్‌బాబు సిమెంట్ ఫ్యాక్టరీకి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ పేర్కొన్నారు.

ఉద్యోగాల పేరుతో ఘరానా మోసం


నిందితుడు శ్రీనివాసులు

డోన్ టౌన్: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి నిరుద్యోగుల నుంచి లక్షల్లో వసూలు చేసి మోసగించిన ఘటన తాజాగా వెలుగులోకి వచ్చింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. డోన్ మండలానికి చెందిన రిటైర్డు ప్రభుత్వ ఉద్యోగి, కృష్ణగిరి మండలానికి చెందిన ఓ వ్యక్తి, కర్నూలు సమీపం జొహరాపురంలోని ప్రైవేట్ స్కూల్లో కరాటే మాస్టర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు కలిసి ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురిని నమ్మించారు. దీంతో పట్టణానికి చెందిన బాషా, సతీష్, ఉంగరానిగుండ్లకు చెందిన ఖాసింబీ, కృష్ణగిరికి చెందిన మరో నిరుద్యోగి, పెద్దొడ్డి గ్రామానికి చెందిన మరో ఐదుగురు రూ.2.50 లక్షలు చొప్పున చెల్లించారు. వీరిలో ఖాసింబీకి వెల్దుర్తి హైస్కూల్లో, బాషాకు కృష్ణగిరి మండలం కోయిలకొండ హైస్కూల్లో ఆరు నెలల క్రితం నకిలీ అపాయింట్‌మెంట్ లెటర్లు అందించి ఉద్యోగాల్లో చేర్పించారు. అయితే ఇప్పటివరకు జీతాలు అందకపోవడం, మిగిలిన వారికి ఉద్యోగాలు ఇప్పించకపోవడంతో బాధితులకు అనుమానం కలిగింది. శనివారం రాత్రి బాధితుల్లో కొందరు జొహరాపురంలోని శ్రీనివాసులు ఇంటి వద్ద కాపుకాచి పట్టుకొని ఆదివారం డోన్ పట్టణ పోలీసుస్టేషన్‌కు తీసుకురావడంతో ఘరానా మోసం వెలుగుచూసింది. ఈ కేసులో ఇంకా ఎంతమంది నిందితులు, బాధితులు ఉన్నారనే కోణంలో పోలీసులు విచారణ జరుపుతున్నారు.



రైతు నేస్తాల సందడి

పంట పొలాల్లో రైతు నేస్తాలైన కొంగలు సందడి చేస్తున్నాయి. రబీ సీజన్‌లో రైతులు పొలాల్లో విత్తనం వేసి మొలకెత్తిన తర్వాత సాగునీరు పెట్టడంతో పచ్చటి పొలాల్లో కొంగలు గుంపులుగా చేరి ఆహారం కోసం అన్వేషిస్తున్నాయి. పొలంలోని పురుగులను తినేస్తూ ఆకలిని తీర్చుకుంటూ రైతులకు నేస్తాలుగా మారాయి. గడివేముల మండల పరిధిలోని పెసరవాయి గ్రామ సమీపంలో ఓ రైతు పొలానికి నీరు పెట్టగా కొంగలు గుంపులు గుంపులుగా చేరడంతో ఈ దృశ్యాన్ని ఆదివారం 'సాక్షి' కెమెరాలో బంధించింది. – గడివేముల